www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -89 మంగళవారం 14 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545




## కేంద్ర సహకారంతోనే

# అభివృద్ధి సాధ్యం

**పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి**

**మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి**

**ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ**

**ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు**

**సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు**

**హైదరాబాద్,జూలై 13, (ప్రజావినికిడి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ **మిగతా 2లో..**



## ఇక హర్మూజ్ జలసంధిని

# మేమే నడిపిస్తాం..

**హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్**

**ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ**

**ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి**

**జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్**



**న్యూఢిల్లీ,జూలై 13, (ప్రజావినికిడి):** అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం **మిగతా 2లో..**

# నరహంతకుడు మృతి

**పురుగుల మందు తాగి ఆత్మహత్య -సూసైడ్ కు ముందు సెల్ఫీ వీడియో**

**కొత్తూరు మండలంలో ఘటన**

**వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి**



**కొత్తూరుజూలై 13, (ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని **మిగతా 2లో..**



## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

**తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ**

**పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 13,(ప్రజావినికిడి):** పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. **మిగతా 2లో..**

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

**ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స**

**మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు**



**ముంబై జూలై 13,(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను **మిగతా 2లో..**

## సుప్రీం సాక్షిగా బయటపడ్డ

# రేవంత్ వైఫల్యం



**బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక**

**గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు**


**మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు**

**సంగారెడ్డి,జూలై 13, (ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే **మిగతా 2లో..**

## జాడలేని వర్షాలు

**ముఖం చాటేసిన మబ్బులు**

**మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్,జూలై 13, (ప్రజావినికిడి):** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు **మిగతా 2లో..**



## సింగరేణిని భ్రష్టు పట్టించిన

# బిఆర్ఎస్, కాంగ్రెస్

**గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు**

**అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది**

**సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 13, (ప్రజావినికిడి):** సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని స్పష్టం చేసిందని తెలిపారు. **మిగతా 2లో..**

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

**మొదటిపేజీ తరువాయి**

ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు.

గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి

అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ కూడా 2500



క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా, కేవలం 6 మోటర్లను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా చెబుతున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకాక కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**

సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి దారితీసిందని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు మిగిల్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## జాడలేని వర్షాలు

**మొదటిపేజీ తరువాయి**

3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

**మొదటిపేజీ తరువాయి**

ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

**మొదటిపేజీ తరువాయి**

ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## నరహంతకుడు మృతి

**మొదటిపేజీ తరువాయి**

వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతిని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న



నిందితుడు.. శుక్రవారంఅర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కుడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ. 2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు.

**వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: (మృతుని సోదరుడు భాస్కర్**

అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు. వాడి వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఏడుస్తూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నాడు.

## ఇక హర్మ్యూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు.

ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మ్యూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మ్యూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మ్యూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

## సాధ్యమైనంత మేర గోదావరి జలాల వినియోగం

**మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం**

**నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక మేరకు నడుచుకుంటున్నాం**

**సమ్మక్క ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు**

**ములుగు,జూలై 13, (ప్రజావినికిడి): :** రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సాధ్యమైనంత మేర వినియోగించు కోవాలని నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమక్క బ్యారేజ్‌లో గేట్లు మూసివేయడం వల్ల 71 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలు ఉన్నాయని, అందువల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా 7 మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సమక్క బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారికి వాస్తవాలు



తెలుసుకోవాలని సూచించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారని, వారి సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే మూడు బ్యారేజీలు ఎందుకు నిర్మించారో మాజీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. సమక్క బ్యారేజ్‌లో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ సులభమవుతుందని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నుంచి ప్రవహించే నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పుడు భారీ బ్యారేజీల నిర్మాణం ఎందుకు చేపట్టారో మాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇంజినీర్ల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన అనేక డ్యామ్‌లు సురక్షితంగా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆరోపించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని తెలిపారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గత ప్రభుత్వ హయాంలోనే సూచించిందని గుర్తుచేశారు. డిజైన్ మార్పులు, నాణ్యతా లోపాల కారణంగానే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని.. మరమ్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.

# రూ.13,600 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ రోడ్లు..

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.1,500 కోట్ల నూతన రహదారులు..**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రూ.13,600 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యాన్యుటీమోడల్(హెచ్ఏఎం) ద్వారా భారీ ఎత్తున రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు.ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.1,500 కోట్లతో నూతన హ్యామ్ రోడ్లు మంజూరు కావడం జిల్లాకు ఎంతో శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గానికి కూడా హ్యామ్ విధానంలో మొత్తం 6 రహదారులు మంజూరయ్యాయని,వీటి మొత్తం పొడవు 83.70 కిలోమీటర్లు,అంచనా వ్యయం రూ.255.34 కోట్లుఅని ఎమ్మెల్యే వెల్లడించారు.రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.ఉదయం మహబూబ్‌నగర్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.అనంతరం మక్తల్,గద్వాల్,వనపర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాయంత్రం వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన హ్యామ్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,
రాష్ట్రం ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడడం లేదన్నారు.వనపర్తి నియోజకవర్గంలో రూ.350 కోట్లతో హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన జరగడం అభివృద్ధి దిశగా కీలక ముందడుగు అని పేర్కొన్నారు.
హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో భారీ ఎత్తున రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని,ఈ పనులు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పనుల్లో కమిషన్ల సంస్కృతి నెలకొని ఉండేదని అన్నారు. పారదర్శకత, నాణ్యత,ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు,దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిని కాపాడండి..

**నాగోల్ పోలీస్ స్టేషన్, ఆసుపత్రి,ప్లేగ్రౌండ్ స్థలం కబ్జా..**

**తక్షణమే స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించాలి..**

**మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కు సోషల్ జస్టిస్ పార్టీ వినతి..**



**నాగోల్,(ప్రజావినికిడి):** పోలీస్ స్టేషన్ల, ప్రభుత్వ ఆసుపత్రి ,ప్లే గ్రౌండ్ కోసం కేటాయించిన 100 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందని అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరుతూ సోషల్ జస్టిస్ పార్టీ ప్రతినిధులు సోమవారం నాడు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సోమవారం నాడు సోషల్ జస్టిస్ పార్టీ సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ మహర్షి,కార్యదర్శి బాలస్వామి బాలాపూర్,హైడ్రా ఏరియా ఇన్ చార్జ్ వరంగల్ రమేష్, మల్కాజ్గిరిరి మున్సిపల్ ఏరియా ఇన్చార్జ్ రాపాక వెంకట్ తదితరులు కలెక్టరేట్ కార్యాలయంలో, మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2022లో ఫతుల్ల గూడ,బండ్లగూడ సర్వేనెంబర్ 58 ,38/6లో మూడు ఎకరాల స్థలాన్ని నాగోల్ పోలీస్ స్టేషన్,ప్రభుత్వ ఆసుపత్రి ప్లే కి రోడ్డు కోసం కేటాయిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని కమిషనర్కు వివరించారు. అనంతరం ఉప్పల్ తహసిల్దార్ లచ్చిరెడ్డి ఎసిపి జానకి రామ్ రెడ్డికి నాగోల్ పోలీస్ స్టేషన్కు కేటాయించిన భూమి సరిహద్దులు కేటాయిస్తూ భూమి కూడా స్వాధీనం అప్పగించారని చెప్పారు దాదాపు 100 కోట్ల రూపాయల విలువైన ఈ మూడెకరాల ప్రభుత్వ స్థలంపై కొందరు కబ్జాదారులు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వారు కమిషనర్ కు వివరించారు. తక్షణమే భూమిని స్వాధీనం చేసుకుని సరిహద్దులు నిర్ణయించి అందులో అభివృద్ధి పనులు ప్రారంభించాలని కమిషనర్ ఉదయ్ కృష్ణారెడ్డిని సోషల్ జస్టిస్ పార్టీ నేతలు కోరారు.

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డు “జీవో నెంబర్ 641“ ను వెంటనే రద్దు చేయాలి: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

**సిద్ధాపూర్‌తో పాటు 20 గ్రామాలను కాలుష్య ముప్పు నుంచి రక్షించాలి..**

**పార్టీలకు అతీతంగా ప్రజల పోరాటానికి అందరూ అండగా నిలవాలి..**

**డంపింగ్ యార్డు రద్దు వరకు బీజేపీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుంది..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ నియోజకవర్గంలోని సిద్ధాపూర్‌లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్(641)ను వెంటనే రద్దు చేసి, సిద్ధాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలను కాలుష్య బారిన పడకుండా రక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.
సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సమావేశానికి జేఏసీ నాయకులు శేఖర్ రెడ్డి,ప్రభాకర్ నాయకత్వం వహించగా,బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందె బాబయ్య,బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, శివశంకర్ (మాజీ ఎంపీపీ), కుమారస్వామి, కాంగ్రెస్ కొత్తూరు మండల అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిద్ధాపూర్ గ్రామంతో పాటు పరిసర గ్రామాలు, తాండాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఐటీ పార్కు వంటి ఉపాధి కల్పించే ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డంపింగ్ యార్డు కోసం జీవో జారీ చేయడం ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయమని అన్నారు.సిద్ధాపూర్ పరిసర ప్రాంతాలు పచ్చని వ్యవసాయ భూములతో కూడిన ప్రాంతమని, వేలాది కుటుంబాలు వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే షాద్‌నగర్ నియోజకవర్గంలో అనేక పరిశ్రమల కారణంగా ప్రజలు కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నారని,అలాంటి పరిస్థితుల్లో మరో భారీ డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం ప్రజల ఆరోగ్యం, భూగర్భ జలాలు, పర్యావరణానికి ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.
డంపింగ్ యార్డును రద్దు చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు,ప్రజా ప్రతినిధులు,ప్రజా సంఘాలు ఒక్క వేదికపైకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.
“సిద్ధాపూర్ ప్రజలారాడమీరు ధైర్యంగా ఉండండి.మీ పోరాటంలో షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ మీకు అండగా ఉంటారు. డంపింగ్ యార్డు రద్దు అయ్యే వరకు ఉద్యమం ఆగదు. అవసరమైతే అన్ని ప్రజాస్వామ్య, చట్టబద్ధ మార్గాల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం” అని ఆయన స్పష్టం చేశారు.ఈ ఉద్యమానికి ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల



నాయకులు మద్దతు తెలపడం సంతోషకరమని పేర్కొంటూ,ప్రజల ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.ఈ అంశాన్ని బీజేపీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లామని,అవసరమైతే చట్టపరమైన అన్ని అవకాశాలను కూడా పరిశీలించి సిద్ధాపూర్ ప్రజలకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని తెలిపారు.
ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు, రైతులు,పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.సమావేశం అనంతరం డంపింగ్ యార్డు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



**వాజేడు,జులై 14,(ప్రజావినికిడి):** వాజేడు మండలం, ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 నియమావళిని ఉల్లంఘిస్తూ జరుగుతున్న అక్రమ భూమి బదిలీలను అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజన హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న తోర్రెం సంతోష్ ఆందోళన వ్యక్తం చేశారు.గిరిజనుల భూములు అక్రమంగా గిరిజనేతరుల మరియు ఇతరులకు పేర్లకు బదిలీ అవుతున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూ హక్కులను కాపాడేందుకు రూపొందించిన 1/70 నియమావళిని కఠినంగా,రాజీ లేకుండా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని మరియు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు.అక్రమ భూమి బదిలీలపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గిరిజనుల భూములను తిరిగి వారికి అప్పగించాలని కోరారు.రెవెన్యూ, ఐటీడీఏ అలాగే సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి 1/70 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.1/70 చట్టం అమలులో నిర్లక్ష్యం కొనసాగితే గిరిజన సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపడతామని తోర్రెం సంతోష్ హెచ్చరించారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
హయత్‌నగర్ డివిజన్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన
హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రస్తుత(లెక్చరర్స్ కాలనీ) దత్తాత్రేయ నగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,సీనియర్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి,జక్కిడి మల్లారెడ్డి, చంద్రారెడ్డి, రాంచంద్రారెడ్డి, పరమేష్‌తో పాటు కాలనీవాసులు రమేష్,వెంకట్ రెడ్డి,శోభన్, ఏడుకొండలు, యాదిరెడ్డి,కిరణ్, యాదగిరి రెడ్డి, రజని,నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంకై పోరాడుదాం

**ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ పిలుపు**




**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టే పథకం అయినటువంటి మధ్యాహ్న భోజనం పథకంలో దాదాపు 50 వేల మంది కార్మికులు పనులు చేయుచున్నారని వీరికి ప్రస్తుతం కేవలం నెలకు 3000 మాత్రమే జీతం చెల్లిస్తున్నారని, వారంలో మూడు రోజులు విద్యార్థులకు కోడిగుడ్డు ఇవ్వాలని నిబంధన ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం గుడ్డుకు ఆరు రూపాయలే చెల్లిస్తున్నారని కానీ మార్కెట్లో గుడ్డు ధర ఎనిమిది రూపాయలు ఉన్నదని ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు తమ జీవితంలో నుంచి వెచ్చించి విద్యార్థులకు భోజనం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సోయి లేకుండా కార్మికుల జీతాల పెంపుదల గాని, వంటకు సరిపడా వస్తువుల సరఫరాకు గాని, ముందుకు రాకపోవడం సిగ్గుచేటు అని వారు విమర్శించారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు అల్పాహారం కూడా అందిస్తామని, మధ్యాహ్న భోజనం ప్రభుత్వ కాలేజీల్లో కూడా అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణ సాధ్యం కావడం లేదని వారు విమర్శించారు. మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేయుచున్న కార్మికులకు కనీస వేతనం పదివేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి నేటికీ కూడా అమలు చేయడం లేదని వారు పేర్కొన్నారు.కేంద్ర కార్మిక సంఘాలుగా కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని కానీ ఈ కార్మికుల జీతాలు ఏ మూలకు సరిపోకుండా కేవలం 3000 జీతం చెల్లిస్తూ అందులో గుడ్డు ధర అధికంగా ఉండడం కూరగాయల ధరలు అధికంగా ఉండడం గ్యాస్ సిలిండర్ సరఫరా చేయకపోవడం వలన కార్మికులు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని వారు విమర్శించారు. ఆగస్టు రెండున రాష్ట్రంలో ఉన్నటువంటి మధ్యాహ్న భోజన కార్మికులందరినీ సమీకరించి హైదరాబాదులో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మహాసభను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.నేడు తెలంగాణ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఆఫీస్ బేరర్ సమావేశం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ అధ్యక్షురాలు పి. ప్రేమ్ పావని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, పూసాల రమేష్ విజయలక్ష్మి, రామ్మూర్తి,లక్ష్మణ్, రామకృష్ణ, ముంతాజ్,రజిత, రంగారెడ్డి,పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడుదాం..!

- జర్నలిస్టులపై రాజకీయాలు చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్..
- మీడియాపై ఇలాంటి వివక్ష ఎప్పుడు చూడలేదు..
- ముఖ్యమంత్రిని బదునాం చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
- టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య..
- ఈ సుద్దపూసల బండారం బయటపెట్టాలి.. జర్నలిస్ట్ కేపీ..
- గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలి.. జిల్లా అధ్యక్షుడు గణేష్..
- రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు "టిడబ్ల్యూజెఎఫ్" జర్నలిస్టుల ఆందోళన..
- కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు..







**షాద్ నగర్,(ప్రజావినికిడి):** సమాజంలో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాం..ఇప్పుడు పోరాడే జర్నలిస్టులే సమస్యల్లో పడ్డారు..అయినా వదిలి పెట్టేది లేదు..మనకోసం మనమే పోరాడుదాం..గల్లి నుంచి ఢిల్లీ దాకా మన పోరాటాన్ని కొనసాగిద్దాం..అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అక్కడికి చేరుకొని కార్యాలయ గేటు ముందు ఆందోళన నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లాకు అధ్యక్షుడు శేరీబాయి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి జాతీయ,రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవేందర్,ఎండి ఖాజాపాషా కేపి, శ్రీనివాసచారి, చంద్రశేఖర్, మన్సూర్ అలీ ఖాన్,శ్రీశైలం, నరసింహారెడ్డి, రాజశేఖర్ తదితరులతో పాటు షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, అమన్ గల్, శంషాబాద్,చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్,కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట్ తదితర ప్రాంతాల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా అక్రిడేషన్ కార్డు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తదితర విషయాలను కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూ, చిన్న సమస్యల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి జర్నలిస్టులకు ఏర్పడుతుందని, ఇది అత్యంత దారుణమని అన్నారు.ఇదంతా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆడిస్తున్న నాటకం అని, దీనిపై ప్రశ్నించడానికి వెళితే కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బదనాం చేస్తుందని ఆరోపించారు. ఎలాంటి సమస్యలనైనా తమ వార్తల ద్వారా తెలియజేసే జర్నలిస్టులు చిన్న సమస్యల కోసం పోరాడాల్సిన దుస్థితి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఎదుర్కొంటున్నామని అన్నారు.40 ఏండ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని అన్నారు.రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ రైల్వే పాసు సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడేందుకు త్వరలో జర్నలిస్టులు ఢిల్లీ వెళ్లాల్సి ఉందని తెలిపారు.

ఇక్కడ గల్లి అయిన అక్కడ ఢిల్లీ అయినా టిడబ్ల్యూజేఎఫ్ ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కొన్ని జర్నలిస్టు యూనియన్లు రాజకీయ పార్టీలలా వ్యవహరిస్తూ జర్నలిజంలో రాజకీయాలు తెచ్చి విభజించి పాలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రిని, మంత్రి పొంగులేటిని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. జర్నలిస్టులకు రైలు,మెట్రో రైలులో కూడా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశామని తెలిపారు.అలాగే విద్య, వైద్యం విషయంలో సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్నారు.

### తీగ లాగుతాం.. డొంక కదిలిస్తాం..
**టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీ**

కొంతమంది అధికారులు అంతా రూల్స్ ప్రకారమే వెళుతున్నామని బిల్డప్పులు ఇస్తున్నారు.కానీ చదువురాని వాళ్లకు కూడా గుర్తింపు కార్డులు జారీ చేశారనీ,కానీ దశాబ్దాలుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న వారిని మాత్రం పక్కన పెట్టారన్నారు. దీనిని వదిలిపెట్టేది లేదు..తీగలాగితే డొంక కదిలిస్తాం.. అని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జర్నలిస్ట్ కేపీ అన్నారు. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అక్రిడేషన్ గుర్తింపు కార్డుల విషయంలో ఇంత దారుణాన్ని ఇప్పటిదాకా చూడలేదని, జర్నలిస్టులను పనిగట్టుకొని కొందరు వెంటాడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అర్హత లేని వారికి ఎంతమందికి అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు.

ఆ జాబితా తమ వద్ద ఉన్నాయని త్వరలోనే అక్రిడేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరించారు.

దీనిపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుద్దపూసల వ్యవహరిస్తున్న అధికారుల బండారాన్ని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు.నిరంతరం వార్తల ద్వారా ప్రజల్లో ఉండి సేవలు అందిస్తూ,నాయకులకు ప్రచారం కల్పించే జర్నలిస్టుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. చాలామంది జర్నలిస్టులను కార్డులు ఇవ్వకుండా వేధిస్తున్న ఈ తీరుపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస అవగాహన లేని,అక్షరం ముక్క రాయలేని జర్నలిస్టులకు కార్డులు ఇచ్చారు. ఇంగ్లీషు రాయడం చేతకాని జర్నలిస్టులకు ఆంగ్ల పత్రికల్లో కార్డులు ఇచ్చారు. ఫీల్డ్ కు సంబంధం లేని వారికి కూడా కార్డులు ఇచ్చారని,కానీ దశాబ్దాలుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న జర్నలిస్టులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై పోరాడి హక్కులను సాధించుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు.




### జర్నలిస్టును గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలి..
**టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్..**

సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులను గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ప్రక్రియలో పూర్తిస్థాయిలో పక్షపాత ధోరణి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.దీనిపై ప్రజాస్వామ్య యుతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను చూసి వారి తరఫున ప్రచారం చేసి గెలిపిస్తే గెలిచాక జర్నలిస్టులను పూర్తిగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం,వైద్య సదుపాయం కల్పించడం, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య లక్ష్యంగా ఈ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. సూర్య దినపత్రికను అదేవిధంగా మరికొన్ని దినపత్రికలను కక్షపూరిత ధోరణిలో పక్కన పెట్టారని ఇదంతా యూనియన్ల రాజకీయమని అన్నారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని ఎల్లప్పుడూ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి ఉండడని అవకాశం మాకు కూడా వచ్చినప్పుడు తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు అన్నారు.హైదరాబాదులో ఈ నెల 15వ తేదీన జరిగే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల జర్నలిస్టులు రఘు,నరేష్, గోపాల్,బుచ్చన్న,యాదగిరి, జగన్,నరసింహ,సురేంద్ర,శంకర్, కస్తూరి రంగనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి,సాయినాథ్ రెడ్డి,రాకేష్, కృష్ణ,ధరశీపాల్, శివ కుమార్, నరేందర్ గౌడ్,రామకృష్ణ, శ్రీకాంత్,ఆవుల రమేష్,శంకర్, చంద్రశేఖర్ గౌడ్,షకీల్,రియాజ్,ఖాలేద్ శ్యామ్ కుమార్, బూర్గుల రమేష్,మల్చలం రమేష్,బండి గోపాల్, సత్యనారాయణ, రవి,రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# వాగు మటుమాయం..

- లింగ మూర్తుల సాక్షిగా కనుమరుగవుతున్న వాగు.
- వాగును పూర్తిగా బండ రాళ్లు,మట్టితో పూడ్చి చదును
- ఈదుల్ల వాగును మింగుతున్న రియల్ ఎస్టేట్ మాఫియా..
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, రెవిన్యూ శాఖ అధికారులు.
- వాగును పూడ్చేస్తే భావితరాలకు భారీ నష్టం చేకూరే అవకాశం..
- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..
- కబ్జాకు గురవుతున్న వాగును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే..





**నందిగామ,(ప్రజావినికిడి):** శతాబ్దాల చరిత్ర కలిగిన ఈదుల్ల వాగు వందలాది మంది అన్నదాతల కుటుంబాల ఆకలిని తీర్చింది.గతంలో రైతులకు సాగునీరు,త్రాగునీరు అందించిన ఈదుల్ల వాగు నేడు మాయం అయిపోతుంది.భూ ఆక్రమార్కుల ఆక్రమణకు గురవుతుంది.నేటి వరకు ఈ వాగులు,కుంటల నుంచి వ్యవసాయ రంగానికి నీరు చేరడంతో పంటలు పండి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహాయపడేవి. అలాంటి వాగులు,కుంటలు నాడు నీటితో కలకళలాడి,నేడు కనీసం చూడడానికి అవకాశం లేకుండా రూపు రేఖలు మాయమవుతున్నాయి.కానీ కొంతమంది ప్రబుద్ధులు వాగును చాపకింద నీరుల కబ్జా చేయడంతో పాటు పూడ్చి వేస్తుండటంతో శివ..శివ..ఇదేమి ఘోరం అంటూ రైతులు,ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రం,అప్పారెడ్డిగూడ గ్రామల శివారులోని ప్రసిద్ధిగాంచిన పురాతన లింగమూర్తుల శివాలయం ఉంది.ఈ శివాలయానికి గతంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నడుచుకుంటూ వచ్చి ఈ వాగులో ప్రవహించే నీళ్లతోనే శుద్ధి చేసుకుని దర్శనం చేసుకునేవారు భక్తులు,ప్రజలు కుటుంబ సభ్యులతో వారోత్సవాలకు, మహాశివరాత్రి పర్వదినం రోజుల్లో ఈ దేవాలయానికి వెళ్లేవారు ఈ వాగు దాటడానికి కాస్త ఆలోచించేవారు.అలాంటి ప్రసిద్ధిగాంచిన వాగును దాదాపు పూర్తిగా ఆక్రమణకు గురైంది.ఈ వాగు దూసకల్ చెరువు, అంబాపురం చెరువులు నిండితే వాటి అలుగు ఈదుల్ల వాగు,నల్లగుంట పాటు కాలువ నుంచి నేరుగా నర్సాప్పగూడ గ్రామంలోని అక్కమ్మ చెరువుకు,అక్కడి నుంచి హిమాయత్ సాగర్ కి వెళ్తాయి.అలాంటి వాగులను చదును చేసి మాయం చేయడం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగామారింది.

### భావితరాలకు భారీ నష్టం.,
**టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు..**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగులు,కాలువలను పూడ్చివేయడం వల్ల చాలా నష్టాలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.ముఖ్యంగా,వర్షపు నీరు వెళ్ళడానికి దారి లేక వరదలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని,అలాగే నీళ్ల నిలువ లేకపోవడంతో భూమిలోకి నీరు చేరదు.భూగర్భ జలాల నీటి మట్టం పడిపోతుంది.దీనివల్ల బోర్లు, బావులు ఎండిపోతాయి. వ్యవసాయానికి నీరు అందక పంటలు దెబ్బతింటాయి. అంతేకాదు,పక్షులు,జంతువుల సహజ నివాసాలు నాశనమై పర్యావరణానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది.ప్రధానంగా భూ గర్భ జలాలు ఎండిపోవడంతో భావితరాలకు వారికి భారీ నష్టం వాటిల్లుతుందని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### వాగు పూడికకు కలిసొచ్చిన బ్రిడ్జ్.

నందిగామ మండల కేంద్రం నుంచి వీర్లపల్లి గ్రామం మార్గ మధ్యంలో ప్రవహించే పెద్ద వాగు వర్షాలు కురిసినప్పుడు రాకపోకలకువాహనదారులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్య గురించి తెలుసుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నూతనంగా బ్రిడ్జ్ వేసేందుకు పనులకు శంకుస్థాపన చేశాడు.ఇక వాగు నుంచి చుట్టుపక్కలకు నీళ్లు వెళ్లకుండా,ఒకే మార్గంలోకి మళ్లించడంతో ఈ ఈదుల్ల వాగులోకి నీళ్ల రాకపోకలు ఆగిపోయాయి.అదే అదునుగా భావించి ఎన్నో ఏళ్లుగా ఉపయోగంలో ఉన్నటువంటి వాగును పెద్ద,పెద్ద బండరాళ్లను వేస్తూ,అక్రమంగా తరలించిన మట్టి,పరిశ్రమలోని నిరుపయోగ వ్యర్థాలతో దర్జాగా పూడ్చి వేయడం చూసి స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక పోతే ఎక్కడ అన్యాయం జరిగిన ఎదిరించి న్యాయం చేయాల్సిన అధికార పార్టీ నాయకులు భావితరాలకు నష్టం చేకూరే విషయాల్లో జోక్యం చేసుకుని అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### గతంలో పరిశ్రమ ప్రహారి కూల్చివేత.. అధికార యంత్రాంగం

గతంలో ఇదే ఈదుల్ల వాగును అనుకుని ఓ పరిశ్రమ నిర్వాహకులు ప్రీ క్యాస్ట్ తో చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు.విషయం తెలుసుకున్న రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు నోటీసులు జారీచేసి వాగును అడ్డంగా కట్టిన ప్రీ క్యాస్ట్ గోడను కూల్చివేశారు.

ఆ సమయంలో కూల్చివేత చర్చనీయాంశంగా మారింది.అధికారులు తీరుపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.అధికారులు తలచుకుంటే అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతాయని వారి నిర్లక్ష్యంతోనే ఇలా అక్రమార్కులు,రియల్టర్లు రెచ్చిపోతున్నారని ప్రజలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఈ వాగు ఆక్రమణపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

### నాడు చర్యలు తీసుకున్న అధికారులు.. నేడు చోద్యం చూస్తున్న వైనం..

ప్రభుత్వ అధికారులు డబ్బున్నోడికి వత్తాసు పలుకుతూ,సామాన్య ప్రజలపై కొరడా ఝుళిపించడం ఎక్కడైనా సర్వసాధారణంగా వింటుంటాం,చూస్తుంటాం.కానీ ప్రజా ప్రభుత్వంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవని ప్రజలు భావించినప్పటికీ అవి నీటిమీద మూటవలె తేలియాడుతున్నాయి.సాక్షాత్తు హెచ్ఎండిఎ పటంలో,ఇరిగేషన్, రెవిన్యూ శాఖల కార్యాలయాల్లోని మ్యాపుల్లో స్పష్టంగా ఈ వాగు కనిపిస్తుంది.చుట్టుపక్కల ప్రజలు,రైతులు,

మేధావులు గతంలో పెద్ద వాగు ఉండేదని, వాడుకలో కూడా ఉండేదని చెబుతున్నారు.

కానీ ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసిన మౌనం వహించడం,అక్రమార్కులకు సహకరించడం మతలబు ఏమిటోనని అధికారుల తీరుపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి..

## ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డ్,ఇండ్ల స్థలాల మంజూరు ప్రారంభించాలి..

## టీడబ్ల్యూజేఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్..







**నాంపల్లి,(ప్రజా వినికిడి):**
రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం ప్రకటించినప్పటికీ, ఆ ప్రక్రియ ముందుకు సాగటంలేదని అన్నారు.ఇండ్ల జాగల మంజూరుకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘానికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని సీఎంను కోరారు. టి డబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హెచ్ యు జే ఆధ్వర్యంలో
హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.
హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డీఆర్వో నారాయణని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ రాంచందర్ మాట్లాడుతూ, నిబంధనల పేరుతో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు.అర్హత ఉంటే నిబంధనలను సడలించైనా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సబ్ కమిటీ పేరుతో కాలయాపన జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.హెచ్ యూజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన ఆర్టీసీ బస్ పాస్ లకు సంబందించి 1/3 ఫేర్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు.టోల్ చార్జీలు,సెస్ పేరుతో జర్నలిస్టులపై అదనపు భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.ఇప్పటికే అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్ లో పని చేస్తున్న జర్నలిస్టులకు మెట్రో రైలులో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు.హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్,కోశాధికారి బి రాజశేఖర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని అన్నారు.ఈనెల 15న హైదరాబాద్ లో ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డీజేఎఫ్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు అక్రిడీటేషన్ల జారిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. హెచ్ యూజే – టీడబ్ల్యూజేఎఫ్ కార్యక్రమాలకు డీజేఎఫ్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. నిరంజన్,జాతీయ కౌన్సిల్ సభ్యులు చిట్యాల మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు బి. దామోదర్,పి. సర్వేశ్వర్ రావు, ఎం రమేష్,జి. వీరేష్,ఎస్ రమేష్, బి కాలేబ్,జి. రేణయ్య,సహాయ కార్యదర్శులు ఎం జీవన్ రెడ్డి,ఎస్ మాధవరెడ్డి,పి. లక్ష్మణ్ రావు, కార్యవర్గ సభ్యులు కె లలిత,పి. విజయ,టీ.రాజేష్ కుమార్, బస్వరాజు, రాజశేఖర్,వెంకట్, వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## కేశంపేట మండల లబ్ధిదారులకు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను షాద్ నగర్ నియోజకవర్గం లోని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు.షాద్ నగర్ నియోజవర్గం కేశంపేట మండలంలోని దత్తాయిపల్లి గ్రామానికి చెందిన టీ తరుణ్,తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన రాజమోని అంజమ్మ ,బట్టిని యదయ్య,గోస్కే నర్సిములు కోనాయపల్లి గ్రామనికి చెందిన ఢిల్లీ లక్ష్మమ్మమ్మ , లేమమిడి గ్రామానికి చెందిన దిద్దెల శంకరమ్మ , అల్వాల్ గ్రామానికి చెందిన కుమ్మరి అంతయ్య , సంతాపూర్ గ్రామానికి చెందిన ఎద్దు ప్రణతి , తదితరులకు మంజూరైన చెక్కలను అందజేశారు.ఈ కార్యక్రమంలో లింగాంధన సర్పంచ్ నాగిల వెంకట్,కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు,పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,తొమ్మిదిరేకుల మాజీ సర్పంచ్ బాలరాజ్ గౌడ్,లెమ్మమిడి డిప్యూటీ సర్పంచ్ ప్రమోధర్ రెడ్డి,మాజీ డిప్యూటీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ యదయ్య,బిఆర్ఎస్ నాయకులు మహేష్,యాదయ్య,షాద్ నగర్ బిఆర్ఎస్ నాయకులు దినేష్ సాగర్,కోనాయపల్లి బిఆర్ఎస్ యువ నాయకులు శశి నేత,విలేజ్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్,సంతోష్ రెడ్డి,ఎస్ మహేష్, అల్వాల్ శేఖర్, తదిరులు పాల్గొన్నారు

# రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణికి 103 ఫిర్యాదులు..





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో మొత్తం (103) ఫిర్యాదులు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.
ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 23,ఇతర శాఖలకు 80, మొత్తం 103 దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, కె.చంద్రారెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి శారద,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోర్నోగ్రఫీ నియంత్రణపై పిల్

## కోర్టు పరిధిలోకి రాదన్న సుప్రీం




**న్యూఢిల్లీ,జూలై, 13,(ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా పోర్నోగ్రఫీ నియంత్రణకు ప్రత్యేక జాతీయ విధానం రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. మైనర్లను అశ్లీల కంటెంట్ ప్రభావం నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాతీయ పాలసీని తీసుకురావాలని పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసు విచారణ సందర్భంగా అశ్లీల కంటెంట్ నియంత్రణ, దానికి సంబంధించిన విధానాల రూపకల్పన వంటి అంశాలు కోర్టుల పరిధిలోకి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా ప్రభుత్వం, పార్లమెంట్, చట్టసభల అధికార పరిధిలోని అంశమని ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రయోజన అంశాలపై కోర్టులు అవసరమైన సందర్భాల్లో జోక్యం చేసుకోగలిగినప్పటికీ, కొత్త విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం న్యాయవ్యవస్థ బాధ్యత కాదని అభిప్రాయపడింది. విధాన నిర్ణయాల విషయంలో కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల అధికారాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

# వైకాపా నేతకు 14 రోజుల రిమాండ్



**హైదరాబాద్‌జూలై, 13,(ప్రజావినికిడి):** వైకాపా అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయన్ను బేగంబజార్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇటీవల ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో నాగార్జున యాదవ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈనెల 10న బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఆదివారం గుంటూరులోని నాగార్జున నివాసానికి పోలీసులు వెళ్లి ఆయన్ను అరెస్ట్ చేశారు.

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

## పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



- 2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు
- ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు
- డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది
- పవన్ ను అవమానిస్తున్నారు...
- వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117



**కొత్తపేట,,జూలై 13, (ప్రజావినికిడి):**
గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ. 152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు.

# సాయికృష్ణ కేసు సుప్రీంకు అప్పగింత

## హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన సిబిఐ



**అమరావతి,జూలై 13, (ప్రజావినికిడి):** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం పై సీబీఐ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ కేసు అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపేది కాదని సీబీఐ తన వాదనలో పేర్కొంది. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తును చేయిస్తోందని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సీబీఐ విచారణ అవసరమని చెప్పడానికి తగిన అసాధారణ పరిస్థితులు లేవని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను సీబీఐ అధికారులు ప్రస్తావించారు. అత్యంత అసాధారణమైన పరిస్థితుల్లో మాత్రమే ఆయా కేసులను సీబీఐకి బదిలీ చేయాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని గుర్తుచేశారు. సాధారణంగా ప్రతి కేసును సీబీఐకి అప్పగించడం వల్ల ఆ సంస్థపై కేసుల భారం పెరిగి, పరిమిత వనరులతో కీలకమైన, సంక్లిష్టమైన కేసుల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని తన కౌంటర్‌లో సీబీఐ అధికారులు ప్రస్తావించారు. అలాగే, ఒకవేళ ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాల్సిన అవసరం ఉందని కోర్టు భావిస్తే, దర్యాప్తు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, ఇతర సహాయ సహకారాలను అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీబీఐ అధికారులు కోరారు. ఈ కేసులో దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించాలా లేదా అనే అంశంపై హైకోర్టు తదుపరి విచారణలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ కేసుపై న్యాయపరమైన పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

# గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు !

**జూలై 13 (ప్రజావినికిడి):**
పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే..చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్దరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు.



చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్దరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది.

వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ది చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్దరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

## ప్రతీకార దాడులకు ఇరాన్ ఎత్తుగడ

### ట్రంప్, నెతన్యాహులను మట్టుబెట్టే ప్లాన్

### తాజాగా స్థానిక మీడియాలో రివెంజ్ లిస్ట్

**టెహ్రాన్,జూలై 13(ప్రజావినికిడి):**
ఇరాన్‌పై అమెరికా తాజా దాడులతో మరోమారు పశ్చిమాసిలో శాంతి కరువయ్యింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించడం గమనార్హం. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అగ్రరాజ్యం చేస్తోన్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేం దుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

## భారత్‌లో పెరుగుతున్న విదేశీ విద్యార్థులు

### మనదేశంలో నేపాల్ విద్యార్థులే అత్యధికం



**న్యూఢిల్లీ,జూలై 13 (ప్రజావినికిడి):** ఇండియాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో నేపాల్ దేశానికి చెందిన వారే అత్యధికంగా ఉన్నారని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. 2023-24 అకాడమిక్ ఇయర్‌లో ఎక్కువ మంది విదేశీ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చిన రాష్ట్రంగా కర్ణాటక ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ సర్వే పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం2023-24 అకాడమిక్ ఇయర్‌లో దేశంలోని వివిధ కళాశాలలు 173 దేశాలకు చెందిన విద్యార్థులకు చోటు కల్పించాయి. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కళాశాలల్లో 58,134 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారు. భారతదేశానికి చదువుకోవడానికి వచ్చే విదేశీ విద్యార్థులలో నేపాల్‌కు చెందిన వారు 24.1 శాతం మంది ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ నుంచి 7 శాతం.. అమెరికా నుంచి 5.9 శాతం.. బంగ్లాదేశ్ నుంచి 5.9 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. అత్యధిక విదేశీ విద్యార్థులు చదువుకోవడానికి ఎంచుకున్న రాష్ట్రంగా కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. 2023-24 అకాడమిక్ ఇయర్‌లో 7,914 మంది విదేశీ విద్యార్థులు కర్ణాటకలో చదువుకున్నారు. రెండో స్థానంలో పంజాబ్.. మూడో స్థానంలో మహారాష్ట్ర నిలిచాయి. అంతర్జాతీయ విద్యార్థులలో 73.6 శాతం మంది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరారు.

## ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు

### ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా -తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్

**టెహ్రాన్,జూలై 13 (ప్రజావినికిడి):**
పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. అమెరికా జరిపిన తాజా సైనిక దాడులపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, వాషింగ్టన్ చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తు న్నాయని ఆరోపించింది. ఇది ముమ్మాటికీ ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమేనని ఆరోపించింది. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తమపై దాడులు చేయడానికి ఏ దేశమైనా తన భూభాగాన్ని లేదా సదుపాయాలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే, ఆ దేశాలను కూడా తాము శత్రువులుగానే పరిగణిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌పై సైనిక దాడులు చేయడానికి ఏ దేశ



భూభాగం లేదా సదుపాయాలు ఉపయోగించినా, దానిని దురాక్రమణకు మూలంగా పరిగణిస్తాం. ఇరాన్ సాయుధ దళాల రక్షణాత్మక చర్యల్లో భాగంగా వాటిని చట్టబద్ధమైన లక్ష్యాలుగా చూస్తాం'. అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇటీవల మస్కట్‌లో జరిగిన చర్చల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ పూర్తిగా తోసిపుచ్చింది. వాటిని 'పచ్చి అబద్ధం' గా తేల్చింది. మస్కట్ చర్చలు కేవలం హోర్ముజ్ జలసంధి నిర్వహణ, అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపైనే జరిగాయని, అమెరికా అధ్యక్షుడు చిత్రీకరిస్తున్నట్లుగా కాదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా జరిపిన సైనిక చర్యలపై ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ స్పందించిన తీరు సరిగ్గా లేదని ఇరాన్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికాను జవాబుదారీగా చేయాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్, భద్రతా మండలిని ఇరాన్ కోరింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలు, పౌరులపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులను ప్రారంభించింది. అంతకుముందు శనివారం కూడా అమెరికా దళాలు ల్యాండ్, సీ-బేస్డ్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, నౌకాదళ నౌకల ద్వారా దాదాపు 140 ఇరాన్ సైనిక లక్ష్యాలపై కచ్చితమైన దాడులు చేశాయి. ఇందులో ఇరాన్ క్షిపణి, డ్రోన్ సైట్లు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాలు, తీర నిఘా ప్రాంతాలు ఉన్నాయి. అమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్ నగరాలైన జాస్క్, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో మూడు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రెస్ టీవీ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు.

## ఆహార కల్తీపై మహారాష్ట్రలో ఉక్కుపాదం

### ఎఫ్‌డీఏ తనిఖీల భయంతో వణికిన పాలవ్యాపారులు -వందల లీటర్ల పాలు మురుగు కాలువల్లో పారబోసిన వైనం

**ముంబై,జూలై 13(ప్రజావినికిడి):**
మహారాష్ట్రలోని సతారా జిల్లా మాన్ తాలూకాలో ఎఫ్‌డీఏ అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారనే ప్రచారం కలకలం రేపింది. దీంతో భయాందోళనకు గురైన కొందరు పాల డెయిరీ నిర్వాహకులు వందల లీటర్ల పాలను రోడ్లపై, మురుగు కాలువల్లో పారబోశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇటీవల మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తుకారాం ముండే.. ఆహార కల్తీ, నాణ్యత లోపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. మాన్ తాలూకాలోని గ్రామాల్లో యథావిధిగా పాల సేకరణ కొనసాగుతోంది. అయితే, మధ్యాహ్నం సమయంలో ఎఫ్‌డీఏ అధికారులు పాల డెయిరీలు, పాల సేకరణ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారనే ప్రచారం వేగంగా వ్యాపించింది. పాల నమూనాలను పరీక్షించి లోపాలు తేలితే కఠిన చర్యలు తీసుకుంటారనే భయంతో కొందరు పాల డెయిరీ నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. నేపథ్యంలోనే పాల సేకరణ వాహనంలో ఉన్న వందల లీటర్ల పాలను రోడ్డు పక్కన, సమీపం లోని మురుగు కాలువలో పారబోశారు. ఈ ఘటనకు





సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రోడ్లపై పాల ప్రవాహం కనిపించిన దృశ్యాలు చూసి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ఘటనతో పాల నాణ్యతపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాలను ఎందుకు పారబోశారు. పాలలో ఏవైనా నాణ్యత సమస్యలు ఉన్నాయా. పాల సేకరణ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెల్లడించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. మహారాష్ట్రలో ఆహార కల్తీపై ఎఫ్‌డీఏ నిఘా మరింత కఠినతరం చేసిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం పాల భద్రత, నాణ్యతపై ప్రజల్లో ఆందోళనలను మరింత పెంచింది.

# అభిషేక్ శర్మ ఖాతాలో విచిత్రమైన రికార్డు..!



సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఆఖరి ఐదో టీ20 మ్యాచ్ టీమిండియాకు ఏమాత్రం కలిసిరాలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం పాలై సిరీస్‌ను చేజార్చుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచులో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఓ అరుదైన రికార్డు సాధించాడు. సౌతాంప్టన్ మ్యాచులో అభిషేక్ శర్మ ఒక విచిత్రమైన, ఎవరూ ఊహించని అంతర్జాతీయ క్రికెట్ మైలురాయిని అందుకొని రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. అభిషేక్ శర్మ.. వన్డే లేదా టెస్ట్ ఫార్మాట్ ఆడకుండా.. అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా నిలిచాడు. శనివారం భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన ఐదో టీ20 మ్యాచులో అతడు ఈ ఫీట్ సాధించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. టీమిండియా తరపున ఇప్పటివరకు 53 టీ20 మ్యాచులు ఆడాడు. ఈ క్రమంలోనే వెస్టిండీస్ మాజీ స్పిన్నర్ శామ్యూల్ బద్రీని అధిగమించాడు. అతడు గతంలో టెస్ట్ లేదా వన్డే ఫార్మాట్ ఆడకుండా జాతీయ జట్టు తరపున అత్యధికంగా 52 టీ20లు ఆడాడు. కాగా ఇటీవల భారత జట్టు టీ20 క్రికెట్‌లో పేలవ ప్రదర్శన చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా వైట్ వాష్‌కు గురైంది. దీంతో 1601 రోజుల తర్వాత ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ టైటిల్స్ సాధించిన టీమిండియా.. ఇలాంటి ఫలితాలు అందుకోవడం పట్ల క్రీడా విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు సిరీస్‌లలోనూ అభిషేక్ శర్మ మోస్తరు ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌లో ఐదో టీ20లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఈ మ్యాచులో టీమిండియా చిత్తుగా ఓడిపోయింది.

# చిరస్మరణీయ విజయం

- లార్డ్స్ టెస్టులో టీమిండియా చారిత్రాత్మక గెలుపు
- ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించిన భారత్
- రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్ల జోరు




టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో హర్మన్‌సేన 270 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. క్రికెట్‌కు పుట్టినిల్లుగా భావించే లార్డ్స్ మైదానంలో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం భారత మహిళల క్రికెట్‌లో ఇది చరిత్రాత్మకం. రెండో ఇన్నింగ్స్‌లో 457 పరుగుల భారీ టార్గెట్ ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలి, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఆట ప్రారంభమైంది. అయితే మునుపటి రోజు జోరును కొనసాగించిన టీమ్‌ఇండియా అమ్మాయిలు అదే జోష్‌లో టపటపా వికెట్లు పడగొట్టారు. దీంతో ఇంగ్లాండ్ ఓవర్‌నైట్ స్కోరుకు 56 పరుగులో జోడించి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. క్రీజులో కుదురుకొని హాఫ్ సెంచరీ సాధించిన అమీ జోన్స్ (54)ను స్నేహ్ రాణా ఔట్ చేసి మళ్లీ వికెట్ల వేట మొదలు పెట్టింది. ఆ తర్వాత 33 బంతులు ఎదుర్కొని ఒకే ఒక్క పరుగు చేసిన ఇస్సీ వాంగ్‌ను దీప్తి శర్మ క్లీన్ బౌల్డ్ చేసింది. ఆ తర్వాత కాసేపటికే లారెన్ (0)ను కూడా దీప్తినే వెనక్కి పంపింది. అయితే చివర్లో ఎకిల్‌స్టోన్ (50) కాసేపు నిలదొక్కుకోవడంతో భారత్ విజయం కాస్త ఆలస్యం అయ్యింది. చివరికి ఆమెను స్నేహ్ రాణా ఔట్ చేసి భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్, ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును పరిగెత్తించింది. మూడో రోజు ఆటలో ఇంగ్లాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లు ముగిసే సరికి 100/5తో నిలిచింది. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 357 పరుగులు అవసరం కాగా.. భారత్ మరో ఐదు వికెట్లు సాధిస్తే చరిత్రాత్మక విజయం సాధిస్తుంది. ఓవర్ నైట్ స్కోరు 154/1తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ కాసేపటికే వికెట్ కోల్పోయింది. జట్టు స్కోరు 161 వద్ద స్మృతి మంధాన 70 రన్స్ చేసి ఔట్ అయింది. అయితే యస్తికా భాటియా మాత్రం అదరగొట్టింది. లార్డ్స్‌లో శతక్కొట్టి.. టెస్ట్ క్రికెట్‌లో ఇక్కడ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. 113 పరుగులు చేసిన అనంతరం ఆమె పెవిలియన్ చేరింది. ఆమె ఔట్ అయిన తర్వాత టీమిండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో రిచా ఘోష్ 50 రన్స్ నాటౌట్‌తో భారత్ భారీ స్కోరు చేసింది. 341/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లాండ్ ముందు 457 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయినప్పటికీ భారత్ తొలి రోజు నుంచే పూర్తిగా ఆధిపత్యం చలాయించింది. ఏ దశలోనూ ఇంగ్లాండ్ విజయం దిశగా సాగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83 పరుగులు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (58 పరుగులు), దీప్తి శర్మ (57 పరుగులు) ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ పోరాడగలిగే 285 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత తొలి బౌలింగ్‌లోనూ అదే సత్తా చాటుతూ ప్రత్యర్థిని 170 రన్స్‌కే ఆలౌట్ చేసింది. టీమ్‌ఇండియా ప్లేయర్లు క్రాంతి గౌడ్, యస్తికా భాటియా తమతమ కెరీర్‌లో అరుదైన ఘనత సాధించారు. రెండో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో సత్తా చాటి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించిన క్రాంతి గౌడ్ తన పేరును లార్డ్స్ ఆనర్స్ బోర్డులో లిఖించుకుంది. దీంతో ఈ గౌరవం అందుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సాధించింది. అంతకుముందు ఏ మహిళా ప్లేయర్‌కు కూడా ఈ గౌరవం దక్కలేదు. ఆ తర్వాత మూడో రోజు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ యస్తికా భాటియా శతకం బాదేసింది. వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భాటియా 158 బంతులు ఎదుర్కొని 113 పరుగులు చేసింది. ఇందులో 14 ఫోర్లు ఉన్నాయి. దీంతో లార్డ్స్ మైదానంలో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ఫలితంగా ఆమె పేరు కూడా అక్కడి ప్రఖ్యాత 'ఆనర్స్ బోర్డు'పై కెక్కింది. ఇది భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయంగా చెప్పవచ్చు. అయితే భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీలాంటి బ్యాటర్లకు సైతం లార్డ్స్‌లో సెంచరీ సాధించడం సాధ్యం కాలేదు. అలాంటిది 26ఏళ్ల యస్తిక ఈ ఘనత అందుకుంది. ఇక లార్డ్స్‌లో శతకం బాదిన భారత 11వ క్రికెటర్‌గానూ నిలిచింది. వినూ మన్కడ్, దిలీప్ వెంగ్‌సర్కార్, గుండప్ప విశ్వనాథ్, రవిశాస్త్రి, మహ్మద్ అజారుద్దీన్, సౌరభ్ గంగూలీ, అజిత్ అగార్కర్, రాహుల్ ద్రవిడ్, కేఎల్ రాహుల్ అజింక్యా రహానే లార్డ్స్‌లో టెస్టు సెంచరీలు చేశారు. సంక్షిప్త స్కోర్లు: భారత్: తొలి ఇన్నింగ్స్ - 285/10 రెండో ఇన్నింగ్స్ - 347/7 (డిక్లేర్డ్) ఇంగ్లాండ్: తొలి ఇన్నింగ్స్ - 170/ 10 రెండో ఇన్నింగ్స్ - 186 / 10

# హెడ్ కోచ్ పదవికి మెక్‌కల్లమ్ రాజీనామా..!



ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్‌కల్లమ్ ఆదివారం (జులై 12, 2026) తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. 2022 నుంచి బెన్ స్టోక్స్‌తో కలిసి 'బజ్ బాల్' క్రికెట్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన అతడు.. తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజుల వ్యవధిలోనే మెక్ కల్లమ్ .. తప్పుకోవడం గమనార్హం. మెక్‌కల్లమ్ నిష్క్రమణ బాజ్ బాల్ శకానికి ముగింపు పలికినట్లయింది. మెక్‌కల్లమ్ 2022 నుంచి ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్‌గా ఉన్నాడు. 2025లో వైట్-బాల్ జట్లకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. "టెస్ట్ జట్టుకు కోచింగ్ ఇవ్వడం అంటే నాకు చాలా ఇష్టం. మేం కలిసి సాధించిన వాటిపై గర్వపడుతున్నా. ఈ కాలంలో ఎన్నో నమ్మశక్యంకాని విజయాలు, అదే సమయంలో కఠిన ఫలితాలు చూశాం. కానీ ఇదంతా ఆటలో భాగమే. టెస్ట్ జట్టుకు హెడ్ కోచ్ పదవిని అదృష్టం, గౌరవంగా భావిస్తున్నా. నా ఈ ప్రయాణంలో మాకు మద్దతు ఇచ్చిన ఆటగాళ్లు, సిబ్బంది, అభిమానులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నా దృష్టి వైట్ బాల్ జట్లకు కోచింగ్ ఇవ్వడంపై ఉంటుంది" అని మెక్ కల్లమ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు. 2022లో ఇంగ్లాండ్ టెస్ట్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్.. అప్పటి కెప్టెన్ బెన్ స్టోక్స్‌తో కలిసి దూకుడైన ఆటకు శ్రీకారం చుట్టాడు. దీనికే 'బజ్‌బాల్' అని పేరొచ్చింది. ప్రారంభంలో బజ్ బాల్ మెరుగైన ఫలితాలు ఇచ్చింది. న్యూజిలాండ్ (3-0), దక్షిణాఫ్రికా (2-1)తో సిరీస్‌లు గెలుచుకుంది. పాకిస్థాన్‌పై 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. కానీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో మాత్రం ఇప్పటివరకు ఫైనల్ చేరలేకపోయింది. ఇంగ్లాండ్ 2021-23 సైకిల్‌లో నాలుగో స్థానంలో, 2023-25 సైకిల్‌లో ఐదో ప్లేసులో నిలిచింది. ప్రస్తుతం 2025-27 స్టాండింగ్స్‌లో ఏడవ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ ఇటీవల టెస్టుల్లో పేలవ ఫలితాలు అందుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియాలో ఇంగ్లాండ్ 4-1తో యాషెస్‌లో పరాజయం పాలైంది. గత నెలలో న్యూజిలాండ్ చేతిలో 2-1 తేడాతో స్వదేశంలో టెస్టు సిరీస్ ఓడిపోయింది.

# చెన్నై హెడ్ కోచ్ పదవికి ఫ్లెమింగ్ రాజీనామా..



## కొత్త కోచ్ రేసులో హేమంగ్ బదానీ, ద్రవిడ్

ఐపీఎల్ చరిత్రలోనే విజయవంతమైన కోచ్‌ల్లో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్ చెన్నై సూపర్ కింగ్స్ తో తన అనుబంధాన్ని ముగించారు. ఏకంగా 18 ఏళ్లపాటు సీఎస్కేతో కలిసి పని చేసిన ఆయన చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. తాము, ఫ్లెమింగ్ ఉమ్మడిగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెన్నై సూపర్ కింగ్స్ సోమవారం ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం సంధి దశలో ఉంది. సీఎస్కేకు క్రేజ్ తీసుకొచ్చిన ధోనీ కెరీర్ చరమాంకంలో ఉంది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. గత మూడు సీజన్లలో చెన్నై ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. 2024, 2025, 2026 సీజన్లలో లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. చెన్నై సూపర్ కింగ్స్ సిస్టర్ ఫ్రాంచైజీ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ సైతం ఈ ఏడాది మేజర్ లీగ్ క్రికెట్‌లో చివరి స్థానానికి పరిమితమైంది. ఈ జట్టు బాధ్యతలను కూడా ఫ్లెమింగ్ పర్యవేక్షించేవారు. ఫ్రాంచైజీకి చెందిన జట్లు వరుసగా విఫలం అవుతున్న నేపథ్యంలో ఫ్లెమింగ్‌తో అనుబంధాన్ని సూపర్ కింగ్స్ తెంచుకుందని భావిస్తున్నారు. ఐపీఎల్‌తోపాటు అమెరికా, సౌతాఫ్రికాల్లోని సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీల బాధ్యతల నుంచి కూడా ఫ్లెమింగ్ తప్పుకున్నారు. 2008లో ఐపీఎల్ తొలి సీజన్లో ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్‌తో అనుబంధాన్ని మొదలుపెట్టిన ఫ్లెమింగ్.. 2009 సీజన్లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. 2026 సీజన్ ముగిసే వరకు ఆయన సీఎస్కే ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 17 ఏళ్లకుపైగా చెన్నై హెడ్ కోచ్‌గా వ్యవహరించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్.. బలమైన ఆధునిక క్రికెట్ సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు ఐపీఎల్ టైటిల్స్ సాధించడంతోపాటు రెండు ఛాంపియన్స్ లీగ్ టైటిళ్లు గెలుపొందింది. 12సార్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన సీఎస్కే పదిసార్లు ఫైనల్‌కు చేరుకుంది. కోచ్ ఫ్లెమింగ్, కెప్టెన్ ధోనీ మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయి. వీరిద్దరికీ మేనేజ్‌మెంట్ పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ స్థాయిలో విజయాలు సాధించగలిగింది. ఫ్రాంచైజీ క్రికెట్లో ఆటగాళ్లు, సహాయక సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. కానీ ధోనీ, ఫ్లెమింగ్ కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరిద్దరూ ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవిస్తూ.. తమ పరిధులను అర్థం చేసుకుంటూ.. ప్రశాంతంగా పని చేసుకొని పోయేవారు. ఒకరిపై మరొకరికి అపారమైన నమ్మకం ఉండేది. సీఎస్కే తరఫున ఆడిన చాలా మంది ఆటగాళు అక్కడి డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం గురించి ఇప్పటికీ గొప్పగా చెబుతుంటారు. "పద్దెనిమిదేళ్లు అనేది స్పోర్ట్స్‌లో లైఫ్ టైమ్, పూర్తి కృతజ్ఞతా భావంతో నేను వీడ్కోలు పలుకుతున్నా. సీఎస్కేతో నేను గడిపిన కాలం నా కోచింగ్ కెరీర్లోనే ఎంతో గొప్పది. మనం సాధించిన ప్రతి దానికీ నేను గర్విస్తున్నాను. మనం ఎన్నో మర్చిపోలేని విజయాలను ఆస్వాదించాం, ఎన్నో క్లిష్ట పరిస్థితులను అధిగమించాం. జీవితాంతం నాతో నిలిచిపోయే జ్ఞాపకాలను సంపాదించుకున్నాను" అని చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న సందర్భంగా స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యాఖ్యానించారు. ఫ్లెమింగ్ హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న వేళ సీఎస్కే ఫ్రాంచైజీ యజమాని రూపా గురునాథ్, మేనేజింగ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ్ ఆయనపై ప్రశంసలు గుప్పించారు. ఎలా ఆడాం అనేదే కాకుండా ఓ ఫ్రాంచైజీగా ఎలాంటి స్థానానికి చేరుకోవాలనుకున్నామో నిర్దేశించడంలో ఫ్లెమింగ్ ఎంతో తోడ్పాటును అందించారని కాశీ విశ్వనాథ్ తెలిపారు. నిలకడ, అణకువ, జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వడం అనే విలువలపై ఆధారపడిన ఓ గొప్ప సంస్కృతిని ఫ్లెమింగ్ నిర్మించారంటూ సీఎస్కే ఎండీ కొనియాడారు.

# 24న సందడి చేయనున్న 'జన నాయగన్'

## ఓవర్సీస్‌లో అన్‌కట్ వర్షన్ విడుదల



ఏడు నెలల నిరీక్షణకు చెక్ పెడుతూ.. 'జన నాయగన్' జులై 24న సందడి చేయనుంది. విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. బోర్డు చెప్పిన మార్పులను చేసి చిత్రబృందం దీన్ని విడుదల చేసేందుకు సిద్ధమైంది. అయితే ఓవర్సీస్‌లో మాత్రం ఈ సినిమా అన్‌కట్ వెర్షన్ విడుదల కానుంది. భారత్‌లో పలు కట్స్ విధించినప్పటికీ, యూకే లో మాత్రం ఈ చిత్రం ఎలాంటి కట్స్ లేకుండా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడ ఈ సినిమాను ఎలాంటి మార్పుల్లేకుండానే విడుదల చేసేందుకు అనుమతి లభించింది. ఇక విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో సినిమా టైటిల్ కార్డులోనూ మార్పు చేశారు. గతంలో దళపతి విజయ్ అనే టైటిల్ కార్డు.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌గా మారనుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించడంతో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని.. మరికొన్ని సన్నివేశాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో త్వరలోనే దీని రిలీజ్ ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# మళ్లీ బిజీగా మారిన నటి లయ

## వదలను సినిమా 17న విడుదల



అందాల నటి లయ 'భద్రం కొడుకో' చిత్రంతో బాలనటిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 'స్వయంవరం'తో హీరోయిన్ గా ఎదిగింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో పలు అర్థవంతమైన చిత్రాలలో నటించిన లయ... ఉత్తమ నటిగా నంది అవార్డులు అందుకుంది. అయితే ఆ తర్వాత వివాహానంతరం అమెరికాకు వెళ్ళిపోవడంతో కొన్నేళ్ళు నటనకు దూరంగా ఉంది. ఆ మధ్య రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోని' మూవీలో తన కూతురుతో కలిసి మెరుపులా మెరిసన లయ... గత యేడాది 'తమ్ముడు' సినిమాతో రీ-ఎంట్రీ ఇచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా లయ అక్కగా నటించింది. కానీ ఆ సినిమా నిరాశ పర్చింది. ఆ తర్వాత తనకు బాగా కలిసి వచ్చిన శివాజీ సరసన లయ 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రంలో నాయికగా నటించింది. కానీ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గతంలో జగపతిబాబు సరసన 'మనోహరం'లో నటించి మంచి పేరు తెచ్చుకున్న లయ ఇప్పుడు మరోసారి ఆయనతోనే 'వదలా' చిత్రంలో చేస్తోంది. హృతికా శ్రీనివాస్ కీలక పాత్ర పోషించిన 'వదలా' హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాను ఆకెళ్ళ వి కృష్ణ తెరకెక్కించాడు. మూడు వారాల క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమాకు మరింత మెరుగులద్ది జూలై 17న విడుదల చేస్తున్నట్టు జగపతి బాబు తెలిపారు. విశేషం ఏమంటే... గతంలో శ్రీకాంత్ సరసన పలు చిత్రాలలో నటించిన లయ ఇప్పుడు 'మిస్టర్ మిడిల్ క్లాస్'మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇందులో రాజేంద్ర ప్రసాద్ వేంకటేశ్వర స్వామిగా నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ మూవీని జి. నాగేశ్వరరెడ్డి డైరెక్ట్ చేశారు. ఈ సినిమా కూడా జూలై 17నే రాబోతోంది. ఇలా సెకండ్ ఇన్నింగ్స్‌లో లయ హీరోయిన్ గా నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం కాకతాళీయం.ఇదే విషయాన్ని 'వదలా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమ్మారెడ్డి భరద్వాజ దగ్గర ప్రస్తావించినప్పుడు ఆయన చాలా స్పోర్టివ్‌గా ఈ అంశాన్ని తీసుకున్నారు. 'ప్రతి వారం ఐదారు సినిమాలు వస్తూనే ఉంటాయి. అందులో బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. లయ నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం తప్పేమీ కాదు. నిర్మాతలం ఎవరి వీలును బట్టి వాళ్ళం సినిమాలు రిలీజ్ చేస్తుంటాం. ఏ సినిమా బాగుంటే అది ఆడుతుంది... అంతే!' అని అన్నారు. ఈ వీకెండ్‌లో ఎనిమిది చిత్రాలు విడుదల అవుతుండగా, అందులో లయవి రెండు సినిమాలు. మరి వీటిల్లో ఏయే సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.

# ధనుష్ సినిమాలో విజయ్ సేతుపతి?..

జాతీయ అవార్డు గ్రహీతలు, నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'తమిళ్ మురుగన్'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అయితే, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఈ ఫస్ట్ లుక్‌ను తన సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో కోలీవుడ్‌లో సరికొత్త చర్చ మొదలైంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి.వండర్‌వాల్ ఫిలింస్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విజయ్ సేతుపతి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేయడంతో, ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అభిమానులు అంచనా వేస్తున్నారు. గతంలో వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై', 'అరసన్' వంటి చిత్రాల్లో విజయ్ సేతుపతి నటించారు. ఈ నేపథ్యంలో తాజా ప్రచారానికి మరింత బలం చేకూరింది.ధనుష్, వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు ఈ శక్తివంతమైన కలయికకు విజయ్ సేతుపతి కూడా తోడైతే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, విజయ్ సేతుపతి నటిస్తున్నట్లు చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తదుపరి నటీనటుల వివరాలు, సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రావాల్సి ఉంది.





# ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై పుకార్లు

## అలాంటిదేమీ లేదంటూ టీమ్ వెల్లడి



జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా జూలై 18న తారక్ కీలక ప్రకటన చేయనున్నారని, అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించ నున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడంతో తాజాగా ఎన్టీఆర్ టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి విజయాన్ని అందుకున్న నేపథ్యంలో, అదే తరహాలో జూనియర్ ఎన్టీఆర్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారనే ఊహాగానాలు మరింత బలపడ్డాయి. గతంలో 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించడం, అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం కావడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలన్నింటికీ ఎన్టీఆర్ టీమ్ ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనతో చెక్ పడింది. టీమ్ విడుదల చేసిన ప్రకటనలో, జూలై 18న రాజకీయ ప్రకటన ఉంటుందంటూ ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఆ రోజు నిర్వహించబోయే కార్యక్రమం 'ఊరు వాడ' పేరుతో ఇప్పటికే ముందుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఒక సామాజిక కార్యక్రమమని వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా 'ఊరు వాడ' కార్యక్రమం లక్ష్యం, ఉద్దేశ్యం, విజన్‌ను ప్రజలకు పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలిపింది. 'ఊరు వాడ' కార్యక్రమానికి సంబంధించిన వేదిక, సమయం, పూర్తి కార్యాచరణ వివరాలను త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా వెల్లడిస్తామని టీమ్ పేర్కొంది. అలాగే మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, సోషల్ మీడియా ఖాతాలు ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఎలాంటి వార్తనైనా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే ప్రచురించాలని కోరుతూ, తప్పుడు ప్రచారం వల్ల అభిమానుల్లో అనవసర గందరగోళం ఏర్పడుతుందని తెలిపింది.

# మహేశ్‌బాబు కుటుంబంలో పెళ్లి సందడి

## కొరియన్ అమ్మాయితో సిద్దార్థ్ గల్లా నిశ్చితార్థం



సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. కొరియాకు చెందిన యువతి హాయిన్ (జిన్నీ)తో ప్రేమలో ఉన్న సిద్దార్థ్, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఈ శుభకార్యానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు హాజరై సందడి చేశారు. మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను షేర్ చేస్తూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోల్లో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, కుటుంబ సభ్యులు కనిపించారు. ముఖ్యంగా మహేష్ అన్న దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా అరుదుగా పబ్లిక్‌లో కనిపించే భారతి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభిమానులు ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సిద్దార్థ్ గల్లా ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు గల్లా జయదేవ్ మరియు పద్మావతి దంపతుల చిన్న కుమారుడు. ఆయన అన్న అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా టాలీవుడ్‌లో అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం అశోక్ గల్లా నటిస్తున్న 'వీసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక సిద్దార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా ఉండి కుటుంబ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కొరియన్ యువతి హాయిన్‌తో ప్రేమలో ఉన్న ఆయన, ఇప్పుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

# వరుణ్ 'కొరియన్ కనకరాజు' టీజర్..

## రాయలసీమ టు కొరియా హారర్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కొరియన్ కనకరాజు టీజర్ విడుదలైన తర్వాత సినిమాపై హైప్ మరింత పెరిగింది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఆ హారర్ కామెడీ మూవీలో ఎంటర్టైన్మెంట్, థ్రిల్, యాక్షన్ ను కొత్త తరహాలో చూపించే ప్రయత్నం చేసినట్లు టీజర్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా రాయలసీమ నుంచి కొరియా వరకు సాగే స్టోరీ లైన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్ ప్రారంభం నుంచే కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం కనిపిస్తుంది. ఒకవైపు సాధారణ రాయలసీమ యువకుడిలా కనిపించే కనకరాజు.. మరోవైపు స్టైలిష్ కొరియన్ మాఫియా బాస్ గా వరుణ్ తేజ్ కనిపించడం కథపై క్యూరియాసిటీని పెంచుతోంది. ఆ రెండు భిన్నమైన షేడ్స్ ను ఎలా కలిపారన్న అంశాన్ని మాత్రం మేకర్స్ పూర్తిగా బయటపెట్టకుండా సస్పెన్స్ కంటిన్యూ చేశారు.వరుణ్ తేజ్ లుక్ టీజర్ లో మెయిన్ అట్రాక్షన్ గా నిలిచింది. రాయలసీమ యువకుడి పాత్రలో చాలా న్యాచురల్ గా కనిపించడంతో పాటు, కొరియన్ అవతార్ లో స్టైలిష్ గా, ఇంటెన్స్ గా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. రెండు విభిన్న పాత్రల్లో కూడా ఆయన చూపించిన బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉన్నాయి. టీజర్ లో మరో స్పెషాలిటీ కామెడీ. ముఖ్యంగా వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే సన్నివేశాలు ఫుల్ గా ఎంటర్టైన్మెంట్ ను పంచేలా కనిపిస్తున్నాయి. హారర్ కామెడీకి అవసరమైన ఫన్నీ ఎలిమెంట్స్ ను దర్శకుడు ఈక్వల్ గా మిక్స్ చేసినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భయం, నవ్వు రెండింటినీ ఒకేసారి అందించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. టెక్నికల్ గా కూడా టీజర్ మంచి రెస్పాన్స్ సంపాదిస్తోంది. కొరియా లొకేషన్లను చూపించిన తీరు, ప్రతి ఫ్రేమ్ ను గ్రాండ్ గా చూపించిన సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విజువల్స్ కు తగ్గట్టుగా సంగీత దర్శకుడు ఎస్. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మరింత బలం చేకూర్చింది. కొన్ని సన్నివేశాల్లో బీజీఎం థ్రిల్ ను పెంచగా, మరికొన్ని చోట్ల ఎంటర్టైన్మెంట్ కు తగ్గట్టుగా సాగింది. హీరోయిన్ గా రితికా నాయక్ నటిస్తున్న ఆ చిత్రాన్ని ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టీజర్ లో క్లియర్ గా కనిపిస్తున్నాయి. విజువల్ క్వాలిటీ, మేకింగ్ స్టాండర్డ్ సినిమాపై మరింత నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. ఇప్పుడు కొరియన్ కనకరాజు మూవీ టీజర్ కేవలం కథను పరిచయం చేయడానికే పరిమితం కాకుండా, సినిమాలో ఉండబోయే ఎంటర్టైన్మెంట్ కు చిన్న ఉదాహరణగా చూపించినట్లు అనిపిస్తోంది. ఇండో- కొరియన్ బ్యాక్ డ్రాప్, వరుణ్ తేజ్ డ్యూయల్ షేడ్స్, హారర్ కామెడీ టచ్, స్టైలిష్ విజువల్స్ కలిసి ఆ చిత్రాన్ని ఆసక్తికరంగా మార్చాయి. టీజర్ కు వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ తో ఆగస్టు 7న విడుదల కానున్న ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్ ను అందుకుంటుందన్న ఆసక్తి ఇప్పుడు సినీ ప్రియుల్లో నెలకొంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613